


అనతి కాలంలోనే
ప్రజల మన్ననలు చూరగొన్న
వన్ నేషన్ దినపత్రికను
చదవండి... చదివించండి....

# వన్ నేషన్

RNI NO. APTEL/2010/33523 తెలుగు దినపత్రిక

సంపుటి: 16 సంచిక: 273 ఎడిటర్: కె.యువరాజ్ మంగళవారం 13-7-2026 పేజీలు: 4 వెల: రూ.3/-

వన్ నేషన్
దినపత్రికను
ఆదరిస్తున్న పాఠకులకు,
ప్రకటనకర్తలకు,
శ్రేయోభిలాషులకు
మా హార్థిక
శుభాకాంక్షలు




## కలిసి సాధిద్దాం!

- రాష్ట్ర విశాల ప్రయోజనాలే లక్ష్యంగా పని చేద్దాం - గోదావరి-కావేరీ అనుసంధానంతో మనకు నీళ్లు, నిధులు వస్తాయి - ఎంపీలకు సీఎం రేవంత్ నిర్దేశం - పార్టీలకతీతంగా ఎంపీలు ఏ సమాచారం అడిగినా ఇవ్వాలని అధికారులకు ఆదేశం

హైదరాబాద్, జులై 13 (వన్‌నేషన్): తెలంగాణ రాష్ట్ర విశాల ప్రయోజనాలే లక్ష్యంగా పని చేయాలని ఎంపీలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఈ విషయంలో రాజకీయాలకతీతంగా కలిసి ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. నీటి పారుదల ప్రాజెక్టులు, మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన అనుమతుల సాధనపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఈనెల 20వ తేదీ నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో కేంద్రంలో పెండింగ్‌లో ఉన్న అంశాలపై ఎంపీలకు ప్రజా భవన్‌లో సోమవారం పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఏర్పాటు చేశారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. "హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటుకు కేంద్ర ఆర్థిక శాఖ అనుమతి అవసరం. ఇందుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి విజ్ఞప్తి చేయాలి. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంలో 95 శాతం భూ్యసకరణ పూర్తయింది. ఆ పనుల ప్రారంభానికి, దక్షిణ భాగం ఆర్ఆర్ఆర్ భూ సేకరణకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలపాల్సి ఉంది. ఈ అంశంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. మూసీ పునరుజ్జీవ పనుల్లో మొదటి దశ టెండర్లకు వచ్చింది. వీటిని అర్బన్ చాలెంజ్ ఫండ్ కింద తీసుకునే విషయంలో కేంద్రం అప్రూవల్ లెటర్ ఇవ్వాల్సి ఉంది. ఇందుకు కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేయాలి" అని ఎంపీలకు సూచించారు. రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వానికి సహకరిస్తున్నామని తెలిపారు.

హైదరాబాద్ మెట్రో ఫేజ్-1 స్వాధీనం, ఫేజ్-2 విస్తరణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వంతో చర్చల సరళిని సీఎం రేవంత్ ఎంపీలకు వివరించారు. ఇందుకు ఎస్‌బీఐ క్యాప్స్‌ని కన్సల్టెంట్‌గా నియమించేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందని, ఆ ప్రక్రియ త్వరగా ముందుకు సాగేలా చూడాలని ఎంపీలకు సూచించారు. ఈ విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డిలకు విజ్ఞప్తి చేశారు.

## తెలంగాణ విద్యారంగంలో చారిత్రక సంస్కరణ

- ఇకపై ప్రతి ఏడాది రెండుసార్లు టీజీటెట్ నిర్వహణ... ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయ నియామకాలకు టెట్ అర్హత తప్పనిసరి - టీజీటెట్--2026 ఫలితాలను విడుదల చేసిన పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డా. ఈ. నవీన్ నికోలస్




హైదరాబాద్, జులై 13 (వన్‌నేషన్): తెలంగాణలో ఉపాధ్యాయ వృత్తిని లక్ష్యంగా పెట్టుకున్న లక్షలాది మంది అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం ప్రకటించింది. ఇకపై ప్రతి ఏడాది రెండుసార్లు తెలంగాణ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టీజీటెట్) నిర్వహించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్, సమగ్ర శిక్ష తెలంగాణ రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ డా. ఈ. నవీన్ నికోలస్, ఐఏఎస్ ప్రకటించారు.దటీజీటెట్--2026 జూన్ పరీక్ష ఫలితాలను విడుదల చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ, అభ్యర్థులకు మరిన్ని అవకాశాలు కల్పించడం, ఉపాధ్యాయ నియామక ప్రక్రియను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఒకే అవకాశంపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా, ఏడాదిలో రెండుసార్లు టెట్ నిర్వహించడం ద్వారా వేలాది మంది యువత తమ అర్హతను మెరుగుపరుచుకునే అవకాశం పొందుతారని పేర్కొన్నారు. డా. నవీన్ నికోలస్ మాట్లాడుతూ, టెట్ అర్హత ప్రభుత్వ పాఠశాలలకే కాకుండా ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయ నియామకాలకు కూడా వర్తిస్తుందని స్పష్టం చేశారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఉద్యోగాలను ఆశించే అభ్యర్థులకు సమాన అవకాశాలు లభించనున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఫలితాల ప్రకారం, టీజీటెట్--2026కు 1,53,752 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, 1,15,028 మంది పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 50,544 మంది అర్హత సాధించారు. మొత్తం ఉత్తీర్ణత శాతం 43.94 శాతంగా నమోదైంది. అలాగే, రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన మార్గదర్శకాల మేరకు ప్రభుత్వం, స్థానిక సంస్థలు, ట్రైబల్ వెల్ఫేర్, రెసిడెన్షియల్ విద్యాసంస్థలు, ప్రత్యేక టీజీటెట్ ద్వారా నియమించబడే ఉపాధ్యాయ నియామకాల్లో ఈ టెట్ అర్హతకు ప్రాధాన్యం ఉంటుందని ఆయన వెల్లడించారు. టీజీటెట్‌ను సంవత్సరానికి రెండుసార్లు నిర్వహించాలనే నిర్ణయం తెలంగాణ విద్యారంగంలో ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని, ఉపాధ్యాయ వృత్తిలోకి రావాలనే లక్ష్యంతో ఉన్న యువతకు ఇది గొప్ప ఊరటనిచ్చే నిర్ణయమని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఈ సంస్కరణతో రాష్ట్రంలో నాణ్యమైన బోధనకు అర్హులైన ఉపాధ్యాయుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వారు పేర్కొంటున్నారు.

## దేవాలయాల ప్రతినిధులు సంబంధిత శాఖల సమన్వయంతో అవసరమైన పనులను త్వరితగతిన పూర్తి

రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోమిశెట్టి శ్రీనివాస్




హైదరాబాద్, జులై 13 (వన్‌నేషన్): గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కమిషనరేట్ లోని రాజేంద్రనగర్ జోనల్ పరిధిలో దేవాలయాలకు కావలసిన మరమత్తు పనులను పరిధిలోని ప్రధాన ఊరేగింపు మార్గాలను సందర్శించి అక్కడ నెలకొన్న సమస్యలను పరిష్కారానికి కావలసిన చర్యలను తీసుకోవాలని అధికారులకు రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోమిశెట్టి శ్రీనివాస్ ఆదేశించారు సోమవారం చాంద్రాయణగుట్ట, ఉప్పుగూడ, రాజన్నబాయి ప్రాంతాలలోని ప్రధాన దేవాలయాలను రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోమిశె శ్రీనివాస్ వివిద శాఖల అధికారులు, భాగ్యనగర్ శ్రీ మహంకాళి బోనాల జాతర ఉత్సవాల ఉమ్మడి దేవాలయ ఊరేగింపు కమిటీ ఛైర్మన్ మల్యాల మధుసూదన్ యాదవ్ తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పర్యటనలో జోన్ పరిధిలోని ప్రధాన దేవాలయాలు, ఊరేగింపు మార్గాలను కాలినడకన సందర్శించి, అక్కడ నెలకొన్న సమస్యలను భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్యం, రహదారులు, డ్రైనేజీ, విద్యుత్, తాగునీరు, వీధి దీపాలు తదితర మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కమిషనర్ ఆదేశించారు. రాజేంద్రనగర్ జోన్ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను జోనల్ కమిషనర్ శ్రీనివాస్ దేవాలయాల ప్రతినిధులు సంబంధిత శాఖల సమన్వయంతో అవసరమైన పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

## వర్షాలు కురిసేందుకు హోమాలు, యజ్ఞాలు జర్పే విధంగా ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలి : భైరవ స్వామి



ఎల్బీనగర్, జులై 13 (వన్‌నేషన్): ఈ సంవత్సరం దేశంలో సరిగా వర్షాలు పడవని శాస్త్రీయంగా సైన్స్ పరంగా ప్రకటన వెలువడిన నేపథ్యంలో కాలభైరవ పీఠాధిపతి భైరవ స్వామి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి వేద బ్రాహ్మణుల తో ప్రతి ఆలయాల్లో వర్షాలు పడే విధంగా యజ్ఞాలు,హోమాలు జరిపించాలని విజ్ఞప్తి చేశారు. లేకపోతే ఇంకా రానున్న రోజుల్లో ప్రజలు కరువు కాటకాలతో అల్లాడిపోతారని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ ఎన్టీఆర్ నగర్ లోని ఆంజనేయ స్వామి ఆలయ ప్రధాన అర్చకులు పచ్చళ్ళ సుబ్రహ్మణ్య వరప్రసాద్ శర్మ, క్రవించి బేకరీ దిల్సుఖ్నగర్ వ్యవస్థాపకులు, హనుమాన్ సేవకులు మంచిరాజు వెంకట నాగ ప్రసాద్ పాల్గొన్నారు.

## తిరుమల అప్లియన్సెస్ లో సన్ షైన్ గ్యాస్ స్టవ్స్ అండ్ చిమ్నీస్ సేల్స్ అండ్ సర్వీసెస్




మనసురాబాద్/వన్ నేషన్ : మనసురాబాద్ నుండి సుష్మా థియేటర్ వెళ్లే దారిలో వివేకానందనగర్‌లో ప్రొప్రైటర్ లోకేష్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన తిరుమల అప్లియన్స్ లో అన్ని రకాలైన స్టవ్ లు, చిమ్నీస్ ఎంతో క్వాలిటీతో రీజనబుల్ రేట్లలో లభిస్తున్నాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మా వద్ద ప్రఖ్యాత ఐ.ఎస్.ఐ మార్క్ ఉన్న సన్ షైన్ బ్రాండ్ లోని అన్ని రకాలైన స్టవ్‌లు, చిమ్నీలు సేల్స్ అండ్ సర్వీసెస్ చేస్తున్నామని అన్నారు. అట్లాగే మావద్ద ఎలక్ట్రిక్ స్టవ్ లు, టూబర్న్ను నుంచి హబ్స్ వరకు, గ్యాస్ గేజర్స్ , హౌస్ పైప్ లైన్స్, డొమెస్టిక్ స్పేర్ పార్ట్స్, కాపర్ గ్యాస్ పైప్లైన్ ఇన్స్టాలేషన్ కమర్షియల్ అండ్ డొమె స్టిక్ స్టవ్స్ లభిస్తున్నట్లు పేర్కొన్నారు. 10 కిలోమీటర్ల పరిధిలోపు డోర్ సర్వీస్ కూడా చేస్తా మని అన్నారు. కావున అందరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కొరకు 9059905984 నెంబర్‌కు సంప్రదించాల్సిందిగా సూచించారు.

వన్ నేషన్
RNI NO. APTEL/2010/33523 తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ ప్రజల పక్షాన నిలబడాలని



అనుకుంటున్నారా?
బాధ్యతయుతమైన జర్నలిజంలో
రాణించాలనుకుంటున్నారా?
అయితే రండి...
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల
వ్యాప్తంగా జిల్లాలు, మండలాల
వారీగా పనిచేసే విలేకరులు
కావలెను.

9948222240

# ఎన్‌సీఎస్‌సీ ద్వారా గత రెండేళ్లలో పరిష్కారమైన కేసులు 60,000కు మాటే

**- ఎన్‌సీఎస్‌సీ ఛైర్మన్ శ్రీ కిషోర్ మక్వానా - ఆధునికీకరించిన ఎన్‌సీఎస్‌సీ రాష్ట్ర కార్యాలయాన్ని ప్రారంభించిన ఛైర్మన్ - ఎన్‌సీఎస్‌సీ హైదరాబాద్ కార్యాలయ పరిధిలో 10,800కు పైగా ఫిర్యాదుల పరిష్కారం, బాధితులకు రూ.33.8 కోట్ల పరిహారం**




**హైదరాబాద్, జులై 13 (వన్‌నేషన్):** గడచిన రెండేళ్ల కాలంలో 60,000కు పైగా కేసులను పరిష్కరించి జాతీయ షెడ్యూల్ కులాల కమిషన్ (ఎన్‌సీఎస్‌సీ) చరిత్ర సృష్టించిందని ఎన్‌సీఎస్‌సీ ఛైర్మన్ శ్రీ కిషోర్ మక్వానా అన్నారు. ఈ రోజు హైదరాబాద్ కవాడిగూడలో ఉన్న సీజీవో టవర్స్‌లో ఆధునికీకరించిన కమిషన్ రాష్ట్ర కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీఎస్‌సీ సభ్యులు శ్రీ వడ్డేపల్లి రాంచందర్, ఎన్‌సీఎస్‌సీ కార్యదర్శి శ్రీ గుడే శ్రీనివాస్ పాల్గొన్నారు.




ఈ సందర్భంగా ఎన్‌సీఎస్‌సీ ఛైర్మన్ మాట్లాడుతూ.. అణగారిన వర్గాలకు న్యాయాన్ని అందించేందుకు, వారి హక్కులను పరరక్షించేందుకు దేశవ్యాప్తంగా ఉన్న ఎన్‌సీఎస్‌సీ కార్యాలయాలు కృషి చేస్తున్నాయని తెలియజేశారు. రాజ్యాంగంలోని 338 అధికరణకు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా కమిషన్ పనిచేస్తోందని తెలియజేశారు. గత 75 ఏళ్లుగా షెడ్యూలు కులాల హక్కుల పరిరక్షణకూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కమిషన్ అవిశ్రాంతంగా కృషి చేస్తోందని వెల్లడించారు. దేశవ్యాప్తంగా గడచిన రెండేళ్లలో 60,000కు పైగా కేసులను పరిష్కరించామనీ, ఇది కమిషన్ చరిత్రలోనే అత్యధికమని ఆయన తెలియజేశారు. వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడంలో న్యాయం, సమానత్వం, సౌభ్రాతృత్వం, హక్కుల రక్షణ ముఖ్యమైన అంశాలని ఛైర్మన్ స్పష్టం చేశారు. ప్రతి ఫిర్యాదుదారునికి సకాలంలో న్యాయం అందించాలనే డాక్టర్ అంబేద్కర్ కలను సాకారం చేసేందుకు కమిషన్ కట్టుబడి ఉంటుందని చెప్పారు. జవాబుదారీతనాన్ని పెంచేందుకు కమిషన్లో అమలు చేస్తున్న బలమైన, చట్టపరమైన యంత్రాంగాల గురించి ఎన్‌సీఎస్‌సీ సభ్యులు శ్రీ వడ్డేపల్లి రాంచందర్ వివరించారు. అవసరమైనప్పుడు నోటీసులను, సమన్లను జారీ చేయడానికీ, ఆదేశాలను పాటించని పక్షంలో కఠిన చర్యలు తీసుకోవడానికీ ఎన్‌సీఎస్‌సీకి పూర్తి అధికారాలున్నాయని ఆయన స్పష్టం చేశారు. ఎస్సీ- ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రస్తుతం అందుతున్న ఆర్థిక సాయం గురించి మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ అభివృద్ధికి, అణగారిన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలని ప్రజా ప్రతినిధులు, విధాన రూపకర్తలను ఆయన కోరారు. సమస్యలను పరిష్కరించడంలో, సమగ్రాభివృద్ధిని ప్రోత్సహించడంలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు కమిషన్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఫిర్యాదు పరిష్కారంలో జాప్యాన్ని తొలగించడానికీ, సామర్థ్యాన్ని విస్తరించడానికీ డిజిటల్ సాధనాలను, ఆధునిక మౌలిక వసతులను ఉపయోగించుకొనేందుకు కమిషన్ కట్టుబడి ఉందని ఎన్‌సీఎస్‌సీ కార్యదర్శి గుడే శ్రీనివాస్ తెలియజేశారు. అసలైన లబ్ధిదారులకు ప్రయోజనాలు, చట్టపరమైన రక్షణ అందించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల మధ్య విస్తృత సహకారం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రాంతీయ శాఖ పనితీరు గురించి ఎన్‌సీఎస్‌సీ రాష్ట్ర కార్యాలయం డైరెక్టర్ డాక్టర్ జీ సునీల్ కుమార్ బాబు వివరించారు. 2024--2026 మధ్య కాలంలో అత్యుతమ పనితీరు కనబరిచిన శాఖల్లో హైదరాబాద్ ఒకటని ఆయన వెల్లడించారు. ఈ సమీక్షా కాలంలో 10,853 ఫిర్యాదులను పరిష్కరించి.. రాజ్యాంగ హక్కులను పరిరక్షించడడంలో హైదరాబాద్ కార్యాలయం కీలకపాత్ర పోషించింది. అదేవిధంగా షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగల (అట్రాసిటీ నిరోధక) చట్టంలోని నిబంధనల ప్రకారం బాధితులకు రూ.33.80 కోట్ల నష్టపరిహారాన్ని అందజేసింది. షెడ్యూలు కులాల హక్కుల తీవ్ర ఉల్లంఘనలకు సంబంధించిన 177 సుమోటో కేసులను నమోదు చేయడంతో పాటు, ఫిర్యాదుదారులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులతో 127 చట్టబద్ధమైన విచారణలను కూడా నిర్వహించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు, బ్యాంకింగ్ కార్పొరేషన్ ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు, వివిధ షెడ్యూలు కుల సంఘాల సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అమలుకు నోచుకోని జర్నలిస్టుల సంక్షేమ హామీలు

**- టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో మేడ్చల్ కలెక్టరేట్ ముందు ధర్నా**




**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా జూలై 13 (వన్ నేషన్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను నిర్దిష్టంగా అమలుచేయాలని మీడియా స్వేచ్ఛ కాపాడాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర వ్యాపిత పిలుపులో బాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని భారీగా నినాదాలు చేస్తూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు ఎస్ కె సలీమా, గుమ్మడి ప్రసాద్,జిల్లా అధ్యక్షుడు మల్లేష్ గౌడ్, కార్యదర్శి బనావత్ రవి నాయక్,మేడ్చల్ నియోజకవర్గం కన్వీనర్ అంబాల విష్ణు,జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. అర్హులైన వారందరికీ వెంటనే అక్రిడేషన్ ఇవ్వాలని, హెల్త్ కార్డులు, పిల్లలకు స్కూల్ ఫీజుల్లో రాయతీలు ఇండ్ల స్థలాల హామీలు అమలు విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యంగా వ్యవరిస్తుందని అన్నారు. ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని లేందంటే ఆందోళ తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా, నియోజక వర్గం ఇంచార్జ్ లు నాయకులు జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

# కుషాయిగూడలో రూ. 2.30 కోట్లతో రోడ్ల అభివృద్ధి

**- పనులను పరిశీలించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి - నాణ్యత విషయంలో రాజీ పడొద్దు: అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం**



**ఉప్పల్ /జూలై 13 /వన్ నేషన్:** ఉప్పల్ నియోజక వర్గం, కుషాయిగూడ వార్డు-16 పరిధిలో రూ. 2.30 కోట్ల వ్యయంతో చేపడుతున్న రోడ్ల అభివృద్ధి పనులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శనివారం స్థానిక కాలనీ వాసుల తో కలిసి పరిశీలించారు. నియోజక వర్గంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్య త నిస్తూ, దెబ్బతిన్న రోడ్ల రీకార్పెటింగ్ మరియు బీటీ రోడ్ల బలోపేత పనులను ఆయన పర్యవేక్షించారు.

ఈ పర్యటనలో భాగంగా మారుతి ఎన్‌క్లేవ్‌లోని రోడ్డు నంబర్-1 నుంచి 13 వరకు, జీహెచ్ఎంసీ ఫ్రీడమ్ పార్క్ నుంచి పోచమ్మ దేవాలయం వరకు మరియు వైష్ణవి ఎన్‌క్లేవ్ అంతర్గత రోడ్ల అభివృద్ధి పనుల పురోగతిని ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో ముచ్చటించి,వారు ఎదుర్కొంటున్న ఇబ్బందు లను అడిగి తెలుసుకున్నారు.ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. “ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధే నా ప్రధాన లక్ష్యం. మెరుగైన రహదారి సౌకర్యా లు కల్పించడం ద్వారా ప్రజల రాకపోకలను సులభతరం చేయడమే ప్రభుత్వ సంక ల్పం. ప్రతి కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధికి నిరంత రం కృషి చేస్తాం” అని స్పష్టం చేశారు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు ఎక్కడా నాణ్యత విషయంలో రాజీ పడకుండా, ఎటువంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా నిర్ణీత సమయంలో గా పూర్తి చేయాలని అధికారు లను ఆదేశించారు.ఈ కార్యక్ర మంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు మహేష్ గౌడ్, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, డప్పు గిరి బాబు, బొడిగే రాజు, కడియాల బాబు, కొల నరేష్, వేణుగోపాల్ రెడ్డి, జైకృష్ణ, సంపత్, శేఖర్, బాలాజీ, కోటి రెడ్డి, సుభాష్, రెడ్డి నాయక్, కాలనీ అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి, కాలనీవాసులు నవీన్ యాదవ్, శ్రీకాంత్ రెడ్డి, వెంకట్ రెడ్డి, శివ శంకర్ గౌడ్, సంతోష్ రెడ్డి, నాగార్జున, జైపాల్ రెడ్డి, రాజేశ్వర్ గుప్త, వీరాభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఎస్సై గోపాటి సతీష్‌ను కలిసిన రామన్నపేట వర్కింగ్ జర్నలిస్టు యూనియన్

**- జర్నలిస్టుల రక్షణ కల్పిస్తామని ఎస్సై హామీ**



**యాదాద్రి జిల్లా : రామన్నపేట జూలై 13 (వన్ నేషన్):** రామన్నపేట మండల పోలీస్ స్టేషన్‌లో నూత నంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై గోపాటి సతీష్‌ను రామన్నపేట మండల వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు.స్థానిక పోలీస్ స్టేషన్‌లో గతంలో పనిచేసిన ఎస్సై డి.నాగరాజు బదిలీ కాగా, వారి స్థానంలో ఎస్సై గోపాటి సతీష్ ఇటీవల బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు శ్యామల నాగరాజు ఆధ్వర్యంలో బృందం ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపింది. యూనియన్ బృందంలో పాల్గొన్నవారు, అధ్యక్షుడు: శ్యామల నాగరాజు - సాక్షి డిజిటల్ న్యూస్, ఉపాధ్యక్షుడు: కర్నే విజయ్ - తొలి వెలుగు, ప్రధాన కార్యదర్శి: భూతం శ్రీకాంత్ - వన్ నేషన్, మీడియా ప్రతినిధి: తల్లారి గణేష్ - వే2న్యూస్, సభ్యులు: మహమ్మద్ రిజ్వాన్ - వార్తా వేదిక న్యూస్, ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు శ్యామల నాగరాజు మాట్లాడుతూ, “ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తున్న జర్నలిజాన్ని కాపాడాలి. జర్నలిస్టులపై దాడులు జరగకుండా రక్షణ కల్పించాలి” అని కోరారు.దీనికి స్పందించిన ఎస్సై గోపాటి సతీష్, “ఎల్లవేళలా జర్నలిస్టులకు, ప్రజలకు రక్షణ కల్పిస్తాము. చట్ట పరిధిలో నిష్పక్షపాతంగా విధులు నిర్వహిస్తాము” అని హామీ ఇచ్చారు. అలాగే నూతనంగా ఎన్నికైన రామన్నపేట మండల వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ అధ్యక్షుడికి, కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు మహమ్మద్ రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఎఫ్ఎం తెలంగాణ చాప్టర్ సమావేశం విజయవంతం



**హైదరాబాద్, జులై 13 (వన్‌నేషన్):** సొసైటీ ఆఫ్ ఫీటల్ మెడిసిన్ (ఎస్ఎఫ్ఎం), తెలంగాణ చాప్టర్, జీన్ సొల్యూషన్స్ ఇండియా సహకారంతో, జూలై 11, 2026న హైదరాబాద్‌లో తమ చాప్టర్ సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ఎస్ఎఫ్ఎం తెలంగాణ అధ్యక్షురాలు డాక్టర్ చిన్మయి రథ, ఎస్ఎఫ్ఎం తెలంగాణ



కార్యదర్శి డాక్టర్ షగున్ అగర్వాల్, మరియు జీన్ సొల్యూషన్స్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ టాంగ్ హంగ్ సాంగ్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో నూతన జన్యు సాంకేతికతలు, ప్రసవపూర్వ నిర్ధారణలో అల్ట్రాసౌండ్ -జన్యుశాస్త్ర అనుసంధానం, మరియు ఎన్ జీ ఎస్/ఏ ఐ-ఆధారిత జన్యు పరీక్షలపై సెషన్‌లతో పాటు, పాత్‌కేర్--జీన్ సొల్యూషన్స్ భాగస్వామ్య ప్రకటన మరియు భారతదేశ ప్రసవపూర్వ పరీక్షల మార్గాన్ని బలోపేతం చేయడంపై ఒక ప్యానెల్ చర్చలు జరిగాయి. ఈ సహకారం అధునాతన ప్రసవపూర్వ జన్యు సంరక్షణను ప్రజలకు మరింత చేరువ చేస్తుంది. సింగపూర్‌లో ప్రధాన కార్యాలయం మరియు హైదరాబాద్‌లో ప్రయోగశాల కార్యకలాపాలు కలిగిన జీన్ సొల్యూషన్స్, భారతదేశం అంతటా అత్యాధునిక జన్యు పరీక్షలకు ప్రాప్యతను విస్తరిస్తూనే ఉంది.

# సెంట్రల్ మినిస్టరుగా నీకు పాలన మీద అవగాహన లేదు బండి సంజయ్

## -టీపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



**హైదరాబాద్, జులై 13 (వన్‌నేషన్):** సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ చెప్పినట్లు చేతనయితే డ్యాం సేఫ్టీ అధికారులతో సమావేశం ఏర్పాటు చేయించు. డైలాగులు వద్దు. కామెంట్స్: బండి సంజయ్ కేంద్ర మంత్రిగా ఉండటం తెలంగాణ ప్రజల దురదృష్టకరం. పదేళ్లు రాష్ట్రంలో BRS, కేంద్రంలో BJP కలిసి సంసారం చేశాయి. పదేళ్ళ మీకు రాజకీయ సంబంధాలు ఉన్నాయి. కేంద్ర జలవనరుల శాఖ మీ దగ్గరే ఉంది. హరీష్ రావుకి పట్టిన రోగమే..బండి సంజయ్ కి పట్టింది. డ్యామ్ సేఫ్టీ అధికారులతో సీఎం, ప్రతిపక్షాలతో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో మీటింగ్ ఏర్పాటు చేయండి. అప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టుపై నిజానిజాలు ఎంటో బయట పడతాయి. అవగాహన లేకుండానే బండి సంజయ్ కేంద్ర మంత్రి అయిపోయారు. ప్రధాని మోడీ మీకు ట్రైనింగ్ ఇవ్వకుండా మంత్రి పదవి ఇచ్చారు. తుంగతుర్తి ఎపిసోడ్ పై ఈ రోజు పీసీసీకి ఇవ్వాల్సిన నివేదిక పోస్ట్ పోన్. ఈ నెల 18 లేదా 20 తేదీ లోపు పీసీసీకి నివేదిక అందజేస్తామన్న జగ్గారెడ్డి. తుంగతుర్తి కాంగ్రెస్ పార్టీలో అంతర్గత రాజకీయ వ్యవహారాలపై రెండ్రోజుల పాటు అభిప్రాయాలు తీసుకున్నాం. ఈ రోజు సాయంత్రం తుంగతుర్తి నివేదికని పీసీసీకి ఇవ్వాలని అనుకున్నాం. కానీ ఇంఛార్జ్ మంత్రి లక్ష్మణ్, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ల అభిప్రాయలు తీసుకోవాలి. వారి అభిప్రాయాలు తీసుకోవడానికి కొంచెం టైం పడుతుంది. అందరూ కలిసి సమన్వయంతో కలిసి పని చేసేలా నిర్ణయం తీసుకుంటాం. వచ్చే ఎన్నికల్లోనూ తుంగతుర్తిలో కాంగ్రెస్ గెలిచేలా కృషి చేస్తాం.

### నెలల తరబడి పునరావృతమయ్యే ఆయాసంతో బాధపడుతున్న శిశువు శ్వాసనాళం నుండి పోకచెక్కను తొలగించిన

# కూకట్‌పల్లి అంకుర ఆసుపత్రి వైద్యులు


**హైదరాబాద్, జులై 13 (వన్‌నేషన్):** పునరావృతమయ్యే ఆయాసం మరియు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులతో బాధపడుతున్న ఆరు నెలల శిశువు శ్వాసనాళంలో లోతుగా ఇరుక్కుపోయిన పోకచెక్కను గుర్తించిన తర్వాత, అంకుర ఆసుపత్రి వైద్యులు ఆ శిశువుకు విజయవంతంగా వ్యాధి నిర్ధారణ చేసి చికిత్స అందించారు. ఆ శిశువు పలుమార్లు దగ్గు, ఆయాసం మరియు ఆయాసంతో బాధపడింది. గతంలో మూడుసార్లు ఇతర వైద్య కేంద్రాలలో ఆమెను చేర్పించారు. యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్లు మరియు నెబ్యులైజేషన్ థెరపీ అందించినప్పటికీ, ఆమె లక్షణాలు పునరావృతమవుతూనే ఉన్నాయి. ఈ అనారోగ్యం నిరంతరంగా కొనసాగడం మరియు ఎటువంటి మెరుగుదల కనిపించకపోవడంతో, అంకుర ఆసుపత్రి వైద్యులు శ్వాసనాళంలో ఏదో సమస్య ఉందని అనుమానించి, బ్రాంకోస్కోపీని నిర్వహించారు. ఈ ప్రక్రియకు పీడియాట్రిక్ పల్మనాలజీ, పీడియాట్రిక్ సర్జరీ మరియు పీడియాట్రిక్ అనస్థీషియా బృందాల మధ్య సన్నిహిత సమన్వయం అవసరమైంది. బ్రాంకోస్కోపీ సమయంలో, అంకుర హాస్పిటల్స్‌కు చెందిన పీడియాట్రిక్స్, పల్మనాలజీ & అలర్జీ కన్సల్టెంట్ డాక్టర్ శ్రీనివాస్ జక్కా, కుడి ఊపిరితిత్తులకు రక్తాన్ని సరఫరా చేసే ప్రధాన వాయుమార్గమైన కుడి ప్రధాన బ్రాంకస్‌లో ఇరుక్కుపోయిన ఒక విదేశీ వస్తువును గుర్తించారు. ఆ వస్తువును విజయవంతంగా తొలగించారు మరియు తరువాత అది ఒక పోకచెక్క ముక్క అని గుర్తించారు. కుటుంబ సభ్యులతో జరిపిన తదుపరి చర్చలలో, శిశువు యొక్క అన్నయ్య లేదా అక్క కొద్దిసేపు పసికందు నోటిలో తమలపాకును పెట్టినట్లు తెలిసింది. కుటుంబానికి తెలియకుండా, ఒక చిన్న పోకచెక్క ముక్కను కూడా లోపల పెట్టగా, అది తరువాత శ్వాసనాళంలోకి వెళ్లిపోయింది. "చిన్న పిల్లలలో విదేశీ వస్తువులు శ్వాసనాళంలోకి వెళ్లడం అనేది సర్వసాధారణమైనప్పటికీ, ప్రాణాంతకమైన పరిస్థితి," అని డాక్టర్ శ్రీనివాస్ జక్కా అన్నారు. "కొంతమంది పిల్లలలో స్పష్టంగా ఊపిరాడకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే, మరికొందరిలో పదేపదే గురక, తగ్గని దగ్గు, లేదా సాధారణ శ్వాసకోశ వ్యాధులను పోలిన ఛాతీ ఇన్ఫెక్షన్లు వంటి లక్షణాలు కనిపించవచ్చు. సరైన చికిత్స అందించినప్పటికీ శ్వాసకోశ లక్షణాలు కొనసాగితే, అనుమానంతో వ్యవహరించడం ఎంత ముఖ్యమో ఈ కేసు స్పష్టం చేస్తుంది." ఈ ప్రక్రియ తర్వాత శిశువు శ్వాసలో గణనీయమైన మెరుగుదల కనిపించింది మరియు స్థిరమైన ఆరోగ్య పరిస్థితితో డిశ్చార్జ్ చేయబడింది. పిల్లలలో నిరంతరంగా గురక, దీర్ఘకాలిక దగ్గు, పదేపదే వచ్చే న్యుమోనియా, లేదా సాధారణ చికిత్సకు లొంగని శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు వంటి లక్షణాలు కనిపిస్తే, తల్లిదండ్రులు మరియు సంరక్షకులు వెంటనే వైద్య పరీక్ష చేయించుకోవాలని అంకుర హాస్పిటల్స్‌లోని వైద్యులు సలహా ఇస్తున్నారు. ముందస్తు రోగ నిర్ధారణ మరియు సకాలంలో జోక్యం చేసుకోవడం వల్ల తీవ్రమైన సమస్యలను నివారించవచ్చు మరియు ఫలితాలను గణనీయంగా మెరుగుపరచవచ్చు.

# ఉద్యోగాల భర్తీ కోసం 15న సిపిఎం మహాధర్నా



**బాలాపూర్, జులై 13 (వన్‌నేషన్):** బాలాపూర్ మండలం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పోస్టర్ రిలీజ్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కమిటీ నాయకులు గోరింక నరసింహ మాట్లాడుతూ దేశానికి స్వతంత్రం వచ్చి 79 సంవత్సరాలు అయినా ఉద్యోగ ఉపాధి అవకాశాలేని పరిస్థితి ఉన్నదని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో లక్షల కొద్ది ఉద్యోగాలు ఖాళీ ఉన్నాయని, బిజెపి అధికారంలో వచ్చి 12 సంవత్సరంలో అయిన హామీలు నెరవేర్చకుండా మేక్ ఇన్ ఇండియా పేరుతో ప్రజాధనాన్ని వృధా చేయడం తప్ప ఉద్యోగుల భర్తీ చేయడం లేదని, ప్రతి ఏడాది ప్రభుత్వ శాఖల్లో 9,000 మంది పదవి విరమణ పొందుతుండగా, రాష్ట్రంలో రెండు లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఇంద్ర పార్క్ దగ్గర ధర్నాకు పెద్ద సంఖ్యలో రావాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పిలుపునియ్యడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ బాలాపూర్ మండల కమిటీ నాయకులు దాసరి బాబు, శేఖర్ యాదవ్, వెంకన్న, మల్లికార్జున్, ప్రభాకర్, కోటేశ్వర్, కుమార్, నరసింహ, వినోద్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి రూ.2 లక్షల విరాళం అందజేసిన చిగిరింత నరసింహారెడ్డి



**బాలాపూర్, జులై 13 (వన్‌నేషన్):** జీహెచ్ఎంసీ బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలోని వెంకటాపూర్--కొత్తపేట్ గ్రామాల సరిహద్దుల్లో ఉన్న అతి పురాతన శ్రీ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం ఆలయ అభివృద్ధి కోసం మాజీ వైస్ చైర్మన్ చిగిరింత నరసింహారెడ్డి రూ.2 లక్షల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆలయ అభివృద్ధి ప్రతి భక్తుని బాధ్యత అని, దైవ సేవలో భాగంగా తాను ఈ విరాళాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. భక్తులందరూ తమ వంతు సహకారం అందించి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధి సమాజంలో ఐక్యత, భక్తి భావనలను పెంపొందిస్తుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, వెంకటాపూర్ మాజీ సర్పంచ్ బొర్రా జగన్ రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు సిల్వేరి సాంబశివ, ఉపాధ్యక్షులు జిట్టరాజు, బాలి నింగని జంగయ్య, టేకుల మాణిక్యం రెడ్డి, టేకుల శశిధర్ రెడ్డి, నీరుడు శ్రీరాములు, ఆలయ కమిటీ జనరల్ సెక్రటరీ దండు శ్రీనివాస్ ముదిరాజ్, పగడాల ఉమేష్, తోట్ల శ్రీనివాస్, దండు విజయ్ కుమార్, నరసింహారావు, కిరణ్, ఆనంద్ రెడ్డి, ఆలయ అర్చకులు బాల మల్లికార్జున శర్మ తదితరులు పాల్గొన్నారు.

### ఇంద్రపాలనగరంలో జాతీయ నట్టల నులిపురుగుల దినోత్సవం

# ఆల్బెండాజోల్ మాత్రల పంపిణీ



**యాదాద్రి జిల్లా: రామన్నపేట జులై 13 (వన్ నేషన్ ప్రతినిధి):** మండలలోని,ఇంద్రపాలనగరం గ్రామంలో జాతీయ నట్టల నులిపురుగుల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 1 నుండి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేసే కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ గర్దాస్ విక్రమ్ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి, పంచాయతీ కార్యదర్శి నరేందర్, సింగణబోయిన గణేష్ యాదవ్, ప్రధానోపాధ్యాయులు శేఖర్, హీనా (ఫీమేల్) జి. సునీత, ఆశా కార్యకర్తలు బాలమణి, వరలక్ష్మి, శ్యామల, వసంత, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, విద్యార్థుల తల్లిదండ్రులు, నీరుడు నరేష్ తదితరులు పాల్గొన్నారు. పిల్లల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రతి అర్హత కలిగిన బాలబాలికకు ఆల్బెండాజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయించాలని అధికారులు సూచించారు.

# ది లాస్ట్ రే ఆఫ్ హోప్ చారిటీ అండ్ వెల్ఫేర్ ఫౌండేషన్‌లో వన్ టైమ్ మీల్ (OTM)



**యాదాద్రి జిల్లా: రామన్నపేట జులై 13 (వన్ నేషన్ ప్రతినిధి):** ఈ కార్యక్రమానికి పవన్ సాయి హాస్పిటల్స్ అధినేత డా. అలేటి శ్రీనివాస్ గౌడ్ ,హీనా మహిమ అభివృద్ధి సంఘం (NGO) అధ్యక్షురాలు ఎం. లలిత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీ కీర్తన ఫౌండేషన్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను వారు అభినందించారు. అనంతరం అక్కడ ఉన్న చిన్నారులు మరియు వృద్ధులకు స్వయంగా భోజనం వడ్డించి, వారితో ఆప్యాయంగా ముచ్చటించారు.ఈ కార్యక్రమంలో MRPS రాష్ట్ర ఉపాధ్యక్షులు BODA సునీల్ మాదిగ, శాలిగౌరారం MRPS మండల ఇన్‌చార్జ్ మాచర్ల ప్రతాప్, బాకి వెంకన్న, కరుపాటి అంబేద్కర్, సాయి సందీప్ పాల్గొన్నారు. అలాగే ది లాస్ట్ రే ఆఫ్ హోప్ చారిటీ అండ్ వెల్ఫేర్ అధ్యక్షులు కురం సంపత్, ఉపాధ్యక్షులు బోడా రవి, సభ్యులు మాచర్ల శ్రీధర్, బోడా నవీన్, బోడా బద్రి, జంపాల ప్రదీప్, ఉయ్యాల వేణు, తందరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.



Printed, Published and Owned by **K.YOUVARAJ** Published at H.No.16-1-427/1, MARUTHI NILAYAM, SAIDABAD, HYDERABAD-59. Printed at ALLAZ PRINTING PRESS H.No. 22-8-147, CHATTA BAZAR, HYDERABAD- 500002, Editor: **K.YOUVARAJ**, RNI No. APTEL/2010/33523, **E-mail: onenation014@gmail.com.**